క్లుప్తంగా

'పల్సి'ని మండలం చేయాలని ధర్నా



దీక్షలో పాల్గొన్న బీడీ కార్మికులు

కుభీర్: మండలంలోని పల్సి గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని చేపట్టిన రిలే నిరాహార దీక్ష 18 రోజులుగా కొనసాగుతోంది. అందులో భాగంగా ఆదివారం గ్రామంలో బీడీ కార్మికులు(మహిళలు) రోడ్డుపై బైఠాయించి వంటావార్పు చేశారు. ఈసందర్భంగా గ్రామ సర్పంచ్ కవిత, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం స్పందించకుంటే త్వరలో తమ పదవులకు సైతం రాజీనామా చేస్తామని సర్పంచ్, ఎంపీటీసీ పేర్కొన్నారు. 2016 నుంచి తమ గ్రామాన్ని మండలం చేయాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ ధర్నాలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

'సభ విజయవంతం చేయండి'

భైంసాటౌన్: మండలంలోని పార్డి(బి) బైపాస్ రోడ్డులో నవంబర్ 3న నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడారు. సభకు సీఎం కేసీఆర్ హాజరు కానున్నారని.. పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. సీనియర్ నాయకులు మురళీగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ పి.కృష్ణ, సంజీవ్‌రెడ్డి, తోట రాము తదితరులున్నారు.

బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా నర్సాగౌడ్



నియామక పత్రం అందిస్తున్న మంత్రి

నిర్మల్‌టౌన్: బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా అమరవేణి నర్సాగౌడ్‌ను నియమించినట్లు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో నర్సాగౌడ్‌కు మంత్రి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే జిల్లా అధికార ప్రతినిధిగా ఉన్న ముడుసు సత్యనారాయణతో కలిసి నర్సాగౌడ్ సేవలు అందిస్తారని పేర్కొన్నారు.

అర్క వంశీయుల పూజలు



కోనేరు వద్ద పూజలు చేస్తున్న ఆదివాసీలు

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కుర్తి గ్రామంలో ఆదివారం గోండురాజుల వంశీయులైన అర్క కులస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, నార్నూర్, నేరడిగొండ, బోథ్, సిరికొండ, వాంకిడి తదితర మండలాల్లోని పలు గ్రామాల ఆదివాసీలు వాహనాల్లో బాదన్‌కుర్తికి తరలివచ్చారు. గ్రామంలోని కోనేటితో పాటు మైసమ్మ ప్రతిమ, హనుమాన్ ఆలయం, బురుజుల వద్ద పూజలు చేశారు. వందల ఏళ్ల కిందట గోండురాజులు ఈ ప్రాంతం కేంద్రంగా పాలించి ఇక్కడే మృతి చెందడంతో ఏటా పూజలు చేయడం ఆనవాయితీ. మానిక్‌రావు దేవుజి సమాధిని దర్శించుకొని ఆదివాసీల డోలు వాయిద్యాలతో ఊరేగింపు చేపట్టి బైలాన్ దేవునికి మొక్కులు చెల్లించుకున్నారు. అర్క మదు, వెంకట్‌రావు, రాజేశ్వరి, గోపాల్, రమేశ్, మేఘ శ్యామ్, స్వామి తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రుల కల సాకారం చేయాలి



ఉద్యోగాలు సాధించిన యువతతో సభ్యులు

కడెం: యువత సన్మార్గంలో నడిచి తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని లింగాపూర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మిడి మహేశ్వర్ అన్నారు. ఇటీవల ఉద్యోగాలకు ఎంపికైన ఇండియన్ బ్యాంక్ మేనేజర్ గుగ్లావత్ కిశోర్‌నాయక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ దుమ్మ సురేశ్‌తోపాటు ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న బొమ్మిడి రాజేందర్, బొమ్మిడి మహేశ్, వారి తల్లిదండ్రులను అసోసియేషన్ సభ్యులు ఆదివారం పంచాయతీ కార్యాలయంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు మల్లేశ్, నరేశ్, శేఖర్, రాజేందర్, గంగాధర్(డబ్బు), కిశోర్, దీపక్, గంగారాం, రంజిత్, స్వామి తదితరులు ఉన్నారు.

అద్దె భవనాలతో అవస్థలు

- ఇబ్బంది పడుతున్న అంగన్‌వాడీ సిబ్బంది, లబ్ధిదారులు
- కేంద్రాల్లో కానరాని సౌకర్యాలు
- సొంత భవనాలు నిర్మించాలని వేడుకోలు



అద్దె భవనంలో కొనసాగుతున్న కుభీర్‌లోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రం

కుభీర్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పోషకాహారం లోపం బారిన పడకుండా పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీ కేంద్రాలకు కుభీర్ మండలంలో సొంత భవనాలు కరువయ్యాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో 74 అంగన్‌వాడీ కేంద్రాలు, 08 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో కుభీర్‌లోని రెండో అంగన్‌వాడీ కేంద్రం, పార్డీ(కె), గొడ్సర గ్రామంలో తప్ప ఎక్కడా సొంత భవనాల్లేవ్. బొండి, చాతా, సొనారిలోని కేంద్రాలకు సొంత భవనాలున్నా.. శిథిలావస్థకు చేరుకున్నాయి. మిగతా అన్ని కేంద్రాలు అద్దె ఇళ్లలోనే కొనసాగుతున్నాయి.

మెజార్టీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే..

మండలంలో కేవలం ఆరు కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలున్నాయి. మెజార్టీ అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే సాగుతున్నాయి. వీటికి ప్రభుత్వం నెలకు రూ.750 నుంచి రూ.1,000 అద్దె చెల్లిస్తుంది. అంత తక్కువకు గ్రామాల్లో అద్దెకు ఇళ్లు దొరకడం లేదు. సదరు అద్దె డబ్బులు కూడా సంవత్సరానికోసారి చెల్లిస్తారు. దీంతో కొన్నిచోట్ల ప్రభుత్వం ఇచ్చే నిధులు సరిపోక అంగన్‌వాడీ టీచర్లే కొంత సొమ్మును సొంతంగా చెల్లిస్తున్నారు. అధికారులు స్పందించి అద్దె సైతం పెంచాలని అంగన్‌వాడీ సిబ్బంది వేడుకుంటున్నారు.

ఒకే గదిలో వంట..

చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందించే అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె ఇళ్లలో ఇరుకుగా కొనసాగుతున్నాయి. అక్కడా మూత్రశాలలు, మరుగుదొడ్లు, నీటివసతి వంటి కనీస సౌకర్యాలు ఉండవు. పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలు లేవు. ఒకే గదిలో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య బోధించడంతోపాటు అందులోనే వంట చేయడం, సరుకులు పెట్టుకోవడం ఇబ్బందిగా ఉందని ఆయాలు పేర్కొంటున్నారు. మండలంలో ప్రస్తుతం ఉన్న మినీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మారుస్తున్నట్లు ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. కానీ దాని జీవో ఇప్పటికీ విడుదల కాలేదు.

ముందుకు రాని కాంట్రాక్టర్లు..

ఆరేళ్ల కిందట 10 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం ఉపాధిహామీ పథకం కింద నిధులు మంజూరు చేసింది. కానీ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు, సర్పంచులు కాని ముందుకు రావడం లేదు. ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సైతం అధికారులు మంజూరైన అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు ముందుకు రావాలని సర్పంచ్‌లకు సూచించారు.

ఇరుకు గదులతో ఇబ్బంది



ప్రభుత్వం ఇస్తున్న అద్దెకు గ్రామాల్లో ఇళ్లు దొరకడం లేదు. దొరికినా ఒకే గదిలో సరుకులు పెట్టడం, వంట చేయడం ఇబ్బంది అవుతుంది. ప్రభుత్వం భవనాలకు అద్దె పెంచి ప్రతి నెల బిల్లులు ఇస్తే బాగుంటుంది.

– సత్యశీల, అంగన్‌వాడీ టీచర్, కుభీర్

అద్దె ఇళ్లు మారుతున్నాం



అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడం ఇబ్బందిగా ఉంది. మూత్రశాలలు, నీటి వసతి లేక చాలా తరచుగా అద్దె ఇళ్లు మారుతున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా సొంత భవనాలు నిర్మించి ఇవ్వాలి.

– కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్, కుభీర్

తీర్మానాలను అందజేశాం

అద్దె భవనాల్లో ఇబ్బంది అవుతుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు సర్పంచ్‌ల వద్ద నుంచి తీర్మానాలు తీసుకొని ఉన్నతాధికారులకు పంపించాం. తహసీల్దార్, ఎంపీడీవో గ్రామాల్లో స్థలాన్ని చూపితే ఉపాధిహామీ నిధులతో ఒక్కో కేంద్రం నిర్మాణానికి రూ.ఐదు లక్షలు మంజూరు చేసే అవకాశం ఉంది.

– శోభ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, కుభీర్

ఆశీర్వదించి.. గెలిపించండి



కడెంలో మాట్లాడుతున్న బొజ్జు పటేల్



సోన్: న్యూవెల్మల్‌లో కాంగ్రెస్ నేతల ప్రచారం

కడెం: మీ బిడ్డగా నన్ను ఆశీర్వదించి.. వచ్చే ఎన్నికల్లో ఖానాపూర్ ఎమ్మెల్యేగా గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు అన్నారు. ఆదివారం మండల కేంద్రానికి వచ్చిన బొజ్జుకు కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. కొండుకూర్ నుంచి సంప్రదాయ వాయిద్యాల నడుమ కన్నాపూర్ చేరుకొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం కడెంలో ఇందిరాగాంధీ, మహాత్ముడితోపాటు తెలంగాణతల్లి విగ్రహాలకు పూలమాలలు వేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శంకర్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, మండలాధ్యక్షుడు మల్లేశ్, వాజీద్‌ఖాన్, కన్నాపూర్ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, రఫీక్, సలీం, బబ్లూ ఉన్నారు.

దస్తురాబాద్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ఆ పార్టీ ఖానాపూర్ అసెంబ్లీ అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత తొలిసారి ఆదివారం మండల కేంద్రానికి వచ్చిన బొజ్జుపటేల్‌కు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా కార్యకర్తలతో బైక్ ర్యాలీ నిర్వహించి.. పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. బీఆర్ఎస్ రేవోజీపేట ఎంపీటీసీ వెడ్మ మాన్కుతోపాటు 80 మంది కాంగ్రెస్‌లో చేరగా.. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండలాధ్యక్షుడు దుర్గం మల్లేశ్, గుండా నరేశ్, చుంచు భూమన్న, రాజేందర్, దశరథ్, రాజేశ్, వెంకట్, పెద్దన్న, రాజన్న, నాగరాజు, పుల్లయ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెంబి: పోడు పట్టాలు ఇస్తామని చెప్పి గిరిజనులను మోసం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో బొంద పెట్టాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు నాగాపూర్, మందపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వప్నిల్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి తదితరులున్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం..

సోన్: మండలంలోని న్యూవెల్మల్–బొప్పారం, లోకల్‌వెల్మల్ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీహరిరావు కూతురు మాధురి ఆదివారం ఇంటింటా తిరుగుతూ కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ప్రచారం చేశారు. శ్రీహరిరావును గెలిపిస్తే జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గడ్డం స్వామి, గంగాధర్, పెద్ద లక్ష్మణ్, గౌస్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ వెళ్లిన జిల్లా యువకులు

నర్సాపూర్(జి): హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై ఇచ్చిన తేనేటి విందులో పాల్గొని నిర్మల్ జిల్లా యువకులు ఆదివారం ఢిల్లీ వెళ్లారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు మేరా మట్టి–మేరా దేశ్‌లో భాగంగా ఢిల్లీలో నిర్మించే యుద్ధవీరుల స్మారకార్థం నిర్మించే అమరవీరుల స్థూపానికి జిల్లాలోని గ్రామాల నుంచి సేకరించిన మట్టిని తీసుకెళ్లారు. దిలావర్‌పూర్, నర్సాపూర్ (జి), లక్ష్మణచాంద, ముథోల్ మండలాల యువకులు అమృత కలశాలతో ఢిల్లీ చేరుకున్నారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి సుశీల్‌కుమార్, వలంటీర్ ప్రవీణ్, నర్సయ్య, రజినీకాంత్, మధుకృష్ణ పాల్గొన్నారు.

'మహా' మద్యం తీసుకొస్తే చర్యలు

తానూరు: ఎన్నికల వేళ అక్రమంగా మహారాష్ట్ర మద్యం, నగదు తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై సందీప్ అన్నారు. ఆదివారం మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని బెల్‌తరోడా జాతీయ రహదారిపై పోలీస్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. ఎస్సై మాట్లాడుతూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేసిన తర్వాతే తెలంగాణలోకి అనుమతించాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ముధోల్ సీఐ వినోద్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పుస్పూర్ గ్రామ సమీపంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆధారాల్లేకుండా రూ.50 వేల కంటే ఎక్కువ తీసుకెళ్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సై సాయికుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వాహనాలు తనిఖీ

కుంటాల: మండలంలోని అప్పారావుపేట్–కల్లూర్ అంతర్రాష్ట్ర మార్గంలో వెంకూర్ వద్ద భైంసారూరల్ సీఐ నైలు వాహనాల తనిఖీ చేపట్టారు. అక్రమంగా మద్యం, డబ్బు తరలిస్తే శాఖపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వారి వెంట ఎస్సై హన్మాండ్లు తదితరులు ఉన్నారు.



లోకేశ్వరం : తనిఖీ చేస్తున్న సీఐ వినోద్‌రెడ్డి

ఆధారాల్లేకుంటే సీజ్ చేస్తాం

భైంసా: ఆధారాలు లేకుండా పరిమితికి మించి నగదు, బంగారం తరలిస్తే సీజ్ చేస్తామని ముధోల్ సీఐ వినోద్, బాసర ఎస్సై గణేశ్ అన్నారు. ఆదివారం బాసరలో వాహనాల తనిఖీలు చేపట్టారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు, లాబ్డి, బాసర చెక్‌పోస్టుల వద్ద కేంద్ర బలగాలతో పహారా నిర్వహిస్తున్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల ప్రచారం

తానూరు: మండలంలోని హిప్నెల్లితండా, ఉమ్రి(కే) గ్రామాల్లో ఆదివారం బీఆర్ఎస్ కార్యకర్తలు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మరోసారి ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోతారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నారాయణ్‌రావ్ పటేల్, వైస్ ఎంపీపీ చంద్రకాంత్, భీంపవార్, చంద్రకాంత్‌యాదవ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ముధోల్ ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డిని గెలిపించాలని జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ అన్నారు. ఆదివారం మండలంలోని కిష్టాపూర్‌లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, నాయకులు భుజంగ్‌రావు, కపిల్, భోజన్న, సుదర్శన్‌రెడ్డి, బండి ప్రశాంత్, ఎల్లన్న, శైలజ, సుధీర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సాయన్న, సాయారెడ్డి, అనిల్ ఉన్నారు.



తానూరు: హిప్నెల్లిలో ప్రచారం చేస్తున్న నేతలు



కుభీర్ : సేవాదాస్‌నగర్‌లో నాయకుల ప్రచారం

కుభీర్ మండలంలో..

కుభీర్: మండలంలోని నందపహాడ్, సోమేశ్వర్‌తండా, వీర్‌గాం, సేవాదాస్‌నగర్ తదితర గ్రామాల్లో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ నాయకుల తప్పుడు ప్రచారం నమ్మొద్దని.. ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, మండలాధ్యక్షుడు అనిల్, మాజీ జెడ్పీటీసీ చవాన్ శంకర్, వైస్ ఎంపీపీ మొహినొద్దీన్ తదితరులు ఉన్నారు.

ముధోల్: బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని మా పార్టీ నాయకులు సూర్యం రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కారేగాం గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మరోసారి ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, రామ్‌రెడ్డి, మక్దూం, కాలీద్, సమి తదితరులున్నారు.

31న బీజేపీ సమ్మేళనానికి తరలిరావాలి

భైంసాటౌన్: పట్టణంలో ఈనెల 31న ఎస్ఎస్ కాటన్‌లో నిర్వహించే నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి అన్ని మండలాల, బూత్‌స్థాయి అధ్యక్షులు, పదాధికారులు హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ అభ్యర్థి పవార్ రామారావుపటేల్ పిలుపునిచ్చారు. అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్ ఆధ్వర్యంలో పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం మండల, బూత్ స్థాయి అధ్యక్షులు, జిల్లా పదాధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ముధోల్ నియోజకవర్గంలో బీజేపీ విజయం కోసం సమష్టిగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రవిపాండే, నారాయణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్, గోపాల్, భూషణ్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న రామారావుపటేల్

గెలుపునకు కృషి చేయండి

ముధోల్: బీజేపీ గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు రాజేశ్‌బాబు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గడగడపకూ తీసుకెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. ముధోల్ ఎమ్మెల్యేగా అభ్యర్థి రామారావుపటేల్‌ను గెలిపించాలని కోరారు. విశ్వనాథ్‌పటేల్, సాయిబాబా, నర్సాగౌడ్, రమేశ్, పోతన్న, దశరథ్ తదితరులున్నారు.

పార్టీలో చేరిక..

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద ఎంపీటీసీ సభ్యుడు జీవన్, వార్డు సభ్యుడు సాయిలు ఆదివారం బీజేపీలో చేరారు. భైంసాలోని బీజేపీ కార్యాలయంలో ముధోల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జయసాగర్, సాయన్న, సోహేందర్, ఆజోబపటేల్, కుంటాల భోజన్న తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కుంటాల: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని దౌనెల్లి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. అపరిచితులు ఫోన్ చేస్తే ఓటీపీలు చెప్పొద్దని సూచించారు. వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని కోరారు. సర్పంచ్ ఎండీ హైమద్, సిబ్బంది గంగాధర్, అనుప్రియ, బిక్కు తదితరులు ఉన్నారు.

'జాన్సన్ నాయక్ గెలుపునకు పని చేస్తాం'

ఖానాపూర్: బీఆర్ఎస్ అధిష్టానం పిలుపు మేరకు వర్గవిభేదాలకు తావు లేకుండా ఖానాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్ గెలుపు కోసం పని చేస్తామని ఏపీపీఎస్సీ మాజీ సభ్యుడు రవీందర్‌రావు అనుచరులు సాగి లక్ష్మణరావు, కొత్తపెల్లి సురేశ్ తదితరులు అన్నారు. ఆదివారం పట్టణంలోని రవీందర్‌రావు నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రావణ్‌రెడ్డి సూచనల మేరకు తామంతా కలిసి పని చేసినప్పటికీ పార్టీలో గుర్తింపు లేకుండా పోయిందన్నారు. శనివారం ఉట్నూర్ బహిరంగ సభకు హాజరైన మంత్రి హరీశ్‌రావు ఉట్నూర్ హెచ్‌కేజీఎన్ ఫంక్షన్‌హాల్‌లో ముఖ్య నాయకులతో సమావేశమై.. మంత్రి ఐకేరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ సమక్షంలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. సమావేశంలో బీసీ రాజన్న, శ్రీనివాస్‌రావు, కారింగుల రాములు, కిషన్, పుప్పాల మురళి, దాసరిగొండ మల్లయ్య, అడిదెల రాజన్న, బెల్లం రమేశ్, గణపతిరావు, కొమురయ్య, హైమద్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్: రాష్ట్రంలోని మాజీ సర్పంచులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల సమస్యలను పరిష్కరించాలని సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు భూమన్నయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులకు రూ.10వేల పెన్షన్, కుటుంబసభ్యులకూ కార్పొరేట్ వైద్యం వర్తించేలా హెల్త్‌కార్డు, వారి పిల్లలకు ఉచితవిద్య అందించాలని కోరారు. సమావేశంలో గొల్లమాడ సూర్యకాంత్‌రావు, టీకాజీ పటేల్, గంగన్న, రామేశ్వర్, సాయినాథ్, భూమయ్య తదితరులున్నారు.

'బీజేపీతోనే ప్రజాసమస్యల పరిష్కారం'

ఖానాపూర్: బీజేపీతోనే గ్రామాల్లోని ప్రజాసమస్యలు పరిష్కారం అవుతాయని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. శనివారం రాత్రి మండలంలోని తర్లపాడ్, పాతతర్లపాడ్ గ్రామాలతోపాటు సత్తనపల్లి పంచాయతీలోని రాంరెడ్డిపల్లెలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరగా ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్దిరమేశ్, మేకల వెంకటేశ్, బల్యాల మహేందర్, పెద్ది నడిపినర్సయ్య, హన్మంతు, రాజన్న, గోగు మహేందర్, శ్రీనివాస్, గంగారెడ్డి, ఎల్లయ్య, భీమన్న, సోమవిజయ్, చందు, మారుతి, గంగారెడ్డి, సురేందర్, సాయి తదితరులు ఉన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఖానాపూర్: గత పాలకులు బీసీలను విస్మరించారని.. కానీ బీసీ వ్యక్తినే సీఎం చేస్తానని ప్రకటించి బీజేపీ అండగా నిలుస్తుందని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు నాయిని సంతోష్, నియోజకవర్గ కన్వీనర్ అంకం మహేందర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకుగా చూసి బీసీలకు రాజకీయంగా అన్యాయం చేశాయన్నారు. కార్యక్రమంలో దాదె మల్లయ్య, తోకల బుచ్చన్న, గుడాల రాజన్న, మల్లారెడ్డి, లింబాద్రి, ఆసం సాయి, దాసరి శ్రీనివాస్, దేశాయ్ రాము, జీవన్, వెంకటేశ్, రాజన్న, శ్రీధర్ తదితరులు ఉన్నారు.



పార్టీలో చేరిన వారితో మాజీ ఎంపీ రమేశ్



జీవాలకు మేతగా పంట

కుంటాల మండల కేంద్రానికి చెందిన మగామ జనార్దన్ అనే రైతు ఓలా శివారులో వానాకాలంలో రెండెకరాల్లో సోయా పంట సాగు చేశాడు. అధిక వర్షాలు, తెగుళ్లు సోకడంతో పంట పూర్తిగా దెబ్బతింది. దీంతో పంట నూర్పిడి చేయలేక వదిలేసి ఆదివారం ఇలా గొర్రెలతో మేపించాడు. పెట్టుబడులకు రూ.26వేలు ఖర్చు చేస్తే నమ్మిన పంట నట్టేట ముంచిందని బాధిత రైతు వాపోయాడు.

– కుంటాల